క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన జోగేశ్వరరావు



అనుదీప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జోగేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా రైతుబంధు సమన్వయకర్తగా నియమితులైన జోగేశ్వరరావు శనివారం కలెక్టర్ అనుదీప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంర్భంగా మొక్కను అందజేశారు. జిల్లాలో ఉద్యాన, ఆయిల్‌పామ్ పంటల విస్తరణ, వ్యవసాయ అనుబంధ పరిశ్రములు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న, సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్, లాల్‌చంద్ పాల్గొన్నారు.

ఏజీఎంకు సన్మానం



సుధాకర్‌ను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న సామ్యూల్ సుధాకర్‌కు ఏజీఎంగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా శనివారం ఆయనను ఏరియా జీఎం కార్యాలయంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ.. సంస్థలో చిరుద్యోగిగా రంగ ప్రవేశం చేసి అంకిత భావంతో పనిచేసి ఏజీఎం స్థాయికి ఎదిగారన్నారు. ఇంకా ఇటువంటి పదోన్నతులు మరిన్ని పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వరిపెల్లి అజయ్, జి.రాజశేఖర్, శేఖర్ బాబు, శ్రీనివాస్‌రెడ్డి, వాల్సన్, గౌస్, నిమ్మల రాజు, వినయ్, నన, సుష్మ పాల్గొన్నారు.

హరితహారం మొక్కల తనిఖీ

జూలూరుపాడు: నల్లబండబోడు గ్రామ పంచాయతీలో నాటిన మొక్కలపై హరితహారం ఆడిట్ జనరల్ సభ్యులు శనివారం తనిఖీ నిర్వహించారు. 2015–2022 వరకు నల్లబండబోడు గ్రామ పంచాయతీలో రైతులు పొలాల గట్లపై నాటిన టేకు మొక్కలు, డంపింగ్ యార్డు, శ్మశానవాటికల్లో బయోఫెన్సింగ్ కోసం నాటిన మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్, హరితవనాలను హరితహారం ఏజీ సభ్యులు పరిశీలించారు. నాటిన మొక్కలు ఎన్ని.. వాటిలో చనిపోయినవి ఎన్ని.. మొక్కల సంరక్షణను ఏజీ సభ్యులు స్వయంగా చూశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, డీఆర్‌ఓ లక్ష్మీనర్సు, పంచాయతీ సెక్రటరీ జ్యోతి, ఈజీఎస్ టీఏలు స్వాతి, సుహాసిని, నాగమణి, శివకృష్ణ, ఎఫ్‌ఏ వీరభద్రం తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలి

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చాలని సీపీఎం వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడు పీహెచ్‌సీని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు రోగులతో మాట్లాడారు. అదే విధంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్‌ను కలిసి ఆస్పత్రిలో సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయకపోవడంతో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. కార్యక్రమంలో తేజావత్ కృష్ణకాంత్, రాములు, భద్రు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: కేఎంసీ పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతి నాయక్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రీతి చిత్రపటానికి ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నేతల పూలమాల వేసి నివాళి అర్పించారు. కేఎంసీ ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు సకాలంలో సరైన చర్యలు తీసుకోకపోవడంతో సైఫ్ వేధింపుల వల్ల ప్రీతి మృతి చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజు, బాలరాజు, ముత్తయ్య, మోకాళ్ల శ్రీనివాస్, పాపారావు, శారద, నాగేశ్వర్‌రావు, వీరన్న, కస్నా, జానకి, పాల్గొన్నారు.

ఎండల్లో హాయ్‌హాయ్..!

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- వెలుస్తున్న పండ్లు, జ్యూస్ దుకాణాలు



మార్కెట్‌లో అమ్ముతున్న పుచ్చకాయలు

సండే స్పెషల్

చుంచుపల్లి: చలికాలం ఇంకా పూర్తిగా కాకముందే ఉష్ణతాపం మొదలయింది. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు ప్రాంతాల్లో వారం, పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇటీవల కొత్తగూడెం పట్టణంలో అత్యధికంగా 38.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలతో ప్రజలకు వేడిగాలులు, ఉక్కపోత బాధలు షురూ అయ్యాయి. ఇప్పుడే ఎండల ప్రభావం ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణతాపం ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇక శీతలీకరణ పరికరాలు, తినుబండారాలు, పానీయాలకు గిరాకీ పెరిగింది. వేసవిని దృష్టిలో ఉంచుకొని శీతలపానీయాల విరివిగా కొత్తకొత్త దుకాణాలు వెలుస్తున్నాయి. పట్టణాల ప్రధాన కూడళ్లతో పాటు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ముందుగానే పలువురు వ్యాపారులు కొబ్బరి బొండాలు, జ్యూస్ పాయింట్లు, పుచ్చకాయలు, చెరుకు, పండ్ల రసాలు, సోడాలు వంటి దుకాణాలు ఏర్పాటు చేశారు. అటు ప్రజలు సైతం ఎండ తీవ్రతను తట్టుకోలేక శీతల పానీయాలను ఆశ్రయించటం కనిపిస్తోంది. వేసవి సీజన్‌లో భానుడి భగభగల నుంచి కాపాడుకునేందుకు ప్రజలు చల్లని నేస్తాలను వెతుక్కుంటున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఇప్పటికే ఇళ్లల్లో కూలర్లు, ఏసీలను వినియోగిస్తుండగా, మరికొందరు కొత్తగా కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీల కొనుగోళ్లు చేస్తున్నారు.



ఎంజీ రోడ్డులో పండ్ల వ్యాపారులు



అమ్మకానికి సిద్ధంగా కూలర్లు

ఎండలు బాగా పెరిగాయి



వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. వేసవి ఆరంభంలోనే షాపులో కూర్చో లేకపోతున్నాం. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మేలో పెరిగే ఎండలను భరించటం చాలా కష్టమే. మధ్యాహ్నం షాపుకు కొనుగోళ్లకు ఎవరూ రావడం లేదు. సాయంత్రమే వస్తున్నారు.

– భల్‌దేవ్, పాన్‌షాపు

కూలర్లు ఎక్కువగా కొంటున్నారు



వేసవికాలం దృష్ట్యా కూలర్ల అమ్మకాలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. వారం, పది రోజులు నుంచి కస్టమర్లు కూలర్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండటంతో రోజుకు 4, 5 కూలర్లు అమ్ముడుపోతున్నాయి. ఈ ఏడాది గిరాకీ బానే ఉండొచ్చు.

– దినేష్, ప్రజాపతి షాపు యజమాని

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ వసంతకుమార్

జూలూరుపాడు: సైబార్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్ అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, ర్యాగింగ్‌పై స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి సీఐ వసంతకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెల్‌ఫోన్ల ద్వారా సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా బ్యాంకు అకౌంట్ నంబర్, పాస్‌వర్డ్, ఓటీపీ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. చదువుపై శ్రద్ధ పెట్టాలని, బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, అదేవిధంగా ఉద్యోగం సంపాదించి కుటుంబానికి, సమాజానికి రోల్ మోడల్‌గా ఉండాలని పేర్కొన్నారు. ఇటీవల ర్యాగింగ్ భూతం ఎక్కువైందని దాని పట్ల జాగ్రత వహించాలన్నారు. చదువుకునే విద్యార్థులు ర్యాగింగ్ కారణంగా ఆత్మహత్యలకు గురికావల్సి వస్తోందని, తద్వారా తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుతుందన్నారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేస్తామని కుటుంబసభ్యులు ఒత్తిడి తెచ్చినప్పటికీ తిరస్కరించాలని చెప్పారు. చదువుపైనే దృష్టి సారించాలని, ఏమైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ తిరుపతిరావు, కేజీబీవీ ఎస్‌ఓ పద్మజ, టీచర్లు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

గోటితలంబ్రాల శోభాయాత్ర

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్ కోదండరామాలయంలో గోటితలంబ్రాల శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో కోటి వడ్ల గింజలను గోటితో బియ్యంగా వలిచి భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి తలంబ్రాలను సిద్ధం చేశారు. తలంబ్రాలను సంప్రదాయబద్ధంగా గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. శోభాయాత్రను ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఖమ్మంపాటి రేణుక, అరుణ, విజయలక్ష్మి, సరోజ, బొద్దుల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ఇవ్వాలని ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): 2022 పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్న భోజన సమయంలో విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈ నెల 6వ తేదీన జరిగే చర్చలలో సమస్యలను పరిష్కరించే విధంగా ఒప్పందాలు జరగాలని పేర్కొన్నారు. మోహనరావు, శివరంజని, బుల్లి వెంకటరాజు, కొలగాని రమేష్, రామకృష్ణ, పులి గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పాల్వంచరూరల్: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖఅధికారి సోమశేఖర్‌శర్మ అన్నారు. స్థానిక పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేటీపీఎస్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం సాయంత్రం డీఈఓ అకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను, ప్రభుత్వం అందిస్తున్న స్నాక్స్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సెక్టోరియల్ అధికారి ఎస్‌కే సైదులు, హెచ్‌ఎం పద్మలత, రాజమోగిలి ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ఎప్పటికి పూర్తయ్యేనో?



మాట్లాడుతున్న పద్మ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పాత కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కొత్తగూడెం 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల కోరిక మేరకు శనివారం వారితో కలిసి డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని సందర్శించారు. మాట్లాడుతూ.. ఐదేళ్లుగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఇంకా చాలా పనులు మిగిలిపోయాయని, ఈ పనులు పూర్తి చేయడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. లక్షల్లో అర్హుల జాబితా ఉండగా.. వందల్లో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. ఇంకా 1500 మందికి ఇళ్లు అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో స్థల సేకరణ చేసి, ఇల్లు లేనివారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, సుధాకర్, కొచ్చెర్ల కిరణ్, దుర్గ, సురేష్, ప్రేమ్, దాసికుమార్, జిల్లాల చింటు, నసీం, ఆసియా బేగం, వేల్పుల సరస్వతి, చింతల విజయ్, దొంగ హేమలత, నాగమణి, బేగం తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం..

ఇల్లెందురూరల్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని విజయలక్ష్మీనగర్ సర్పంచ్ పూనెం కవిత పిలుపునిచ్చారు. గ్రామంలో చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగుతున్నట్లు తెలిసినా, వివక్షకు గురైన పిల్లలను చూసినా, నిరాశ్రయులైన, గృహ హింసకు గురైన పిల్లలు కనిపించినా వెంటనే 1098 నంబర్ ద్వారా చైల్డ్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. చైల్డ్‌లైన్ ప్రతినిధి సారిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొమరమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పద్మ, శ్రీలత, ఉమ, సమత పాల్గొన్నారు.

మహిళా హక్కులను రక్షించుకుందాం..





ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న, టేకులపల్లి: మాట్లాడుతున్న సీడీపీఓ తార

టేకులపల్లి: మహిళా హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, హక్కులను కాపాడుకుంటూ మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం టేకులపల్లి అంగన్‌వాడీ కేంద్రం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం మహిళల హక్కులు, వాటి సద్వినియోగం గురించి వివరించారు. లైంగికదాడులు, హత్యలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బాధిత బాలికలు, యువతులు, మహిళలు, వృద్ధులు, అనాథలు, గృహహింస, బాల్య వివాహాలు తదితరములపై ఎవరైనా తమ దృష్టికి వస్తే 181 మహిళా కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే సఖి సెంటర్ వారు రక్షణ కల్పిస్తారని, కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడ సరిత, సూపర్‌వైజర్లు కె.అనురాధ, సక్కుబాయి, లక్ష్మి, నిర్మల, టీచర్లు ఇందిర, హెల్పర్ నాగమణి, తల్లులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మిప్రసన్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మామిడిగూడెం, ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఆమె పాల్గొని ప్రసంగించారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తాటి మౌనిక, చాట్ల భాగ్యమ్మ, ఎంపీటీసీ పూనెం లింగమ్మ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొత్తగూడెంలో జిల్లా దిశ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల అభ్యున్నత కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి ఎంపీపీ బాదవత్ శాంతి, షీ టీం ఎస్ఐ రమాదేవి, దిశ ప్రొటెక్షన్ నేషనల్ ప్రెసిడెంట్ బి.రాజు, దిశ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, మునిలా, దిశ కమిటీ సభ్యులు దుర్గాబాయి, మాధవి, కశ్రీ అపర్ణ, మెరుగు అనసూయ, క్లాసిక్ దుర్గ, పూర్ణ పాల్గొన్నారు.

ఇల్లెందు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు, కుటుంబాల మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. శనివారం పట్టణంలోని సింగరేణి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్ ఇన్ బకెట్, బాంబ్ ఇన్ సిటీ, బాల్ షూటింగ్ ఆటల పోటీలు నిర్వహించారు. సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, పీఈటీ వీరభద్రయ్య, పీఎస్ హెచ్‌ఎం సుధాకర్, సేవా కార్యదర్శి విజయ, ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు కళ్యాణలక్ష్మి వరం



పాల్వంచరూరల్: చెక్కు అందజేస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



టేకులపల్లి: చెక్కు అందజేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ

పాల్వంచరూరల్: పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి పథకం ఒక వరమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పాతపాల్వంచలోని తన నివాసంలో శనివారం సుజాతనగర్ మండలంలోని 33మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం కింద సుమారు రూ.33.31 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీచే శారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి, తహసీల్దార్ సునిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, ఎంపీటీసీ ఎం.గణేష్, సర్పంచ్ హతిరామ్‌లతోపాటు బీఆర్ఎస్ పార్టీనాయకులు పాల్గొన్నారు.

టేకులపల్లి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో నిరుపేదల కళ్లల్లో ఆనంద భాష్పాలు వెల్లివిరుస్తున్నాయని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 58 కల్యాణలక్ష్మి, 11 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే కేసీఆర్ లక్ష్యమన్నారు.

కార్యక్రమంలో డీటీ లావణ్య, ఎంపీపీ భూక్యా రాధ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు భూక్యా చిన్ని, సరోజిని, సురేందర్, రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: బంజార గిరిజనుల ఆరాధ్యదైవం సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను పడమటనర్సాపురం శ్రీసేవాలాల్ మహారాజ్ ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ హాజరయ్యారు. బంజారా నాయకులు, సాధువులు, పూజారులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగ్ బండారో(నైవేద్యం)ను శ్రీసేవాలాల్ మహారాజ్‌కు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజారాలు శ్రీసేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో పయనించాలన్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో గుగులోత్ రాజేష్ నాయక్, భూక్యా వీరభద్రం, ఆంగోత్ రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

ఇల్లెందు: ఏళ్ల తరబడి హక్కు పత్రాలు లేకుండా జీవిస్తున్న స్టేషన్ బస్తీని రెగ్యూలరైజేషన్ చేయించాలని స్టేషన్ బస్తీ 20, 21 వార్డుల ప్రజలు ఎమ్మెల్యే హరిప్రియను కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే హరిప్రియ శనివారం స్థానిక కౌన్సిలర్లతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలను సేకరించారు. 19వ వార్డు ఎల్‌బీఎస్ నగర్‌లో పర్యటించి డ్రెయినేజీ, రోడ్లు, విద్యుత్ లైట్లను పరిశీలించారు. అనంతరం 20, 22, 23 వార్డుల్లో పర్యటించారు. స్టేషన్ బస్తీలోని కాలువలు, రోడ్లు పరిశీలించారు. స్టేషన్ బస్తీలోని ఇళ్ల స్థలాలకు పట్టాలు లేకపోవటం, సింగరేణి లీజు పరిధిలో ఉండటం వల్ల ఇబ్బందులకు పడుతున్నామని బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పట్టణం మధ్య నుంచి వెళ్లే సింగరేణి బొగ్గు రైలు వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సయ్యద్ జానీపాషా, పత్తి స్వప్న, కొండపల్లి సరిత, మొగిలి లక్ష్మి, అంకుపాక నవీన్, తోట లలిత శారద, చీమల సుజాత పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి ముఖేష్

ఇల్లెందు: నేటి సమాజంలో బాలికలు, మహిళలు తమకు రాజ్యాంగంలో కల్పించబడిన చట్టాల పట్ల అవగాహన లేకపోతే తీవ్ర అన్యాయానికి గురవుతారని ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జే.ముఖేష్ అన్నారు. శనివారం ఇల్లెందులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన న్యాయచైతన్య సదస్సులో మహిళలు, వారి హక్కుల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ, అక్కడి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, కీర్తి కార్తీక్, పి.బాలకృష్ణ, ఊర్మిళ, ఉమామహేశ్వరరావు, వినయ్, వీరేంద్ర, టి.అనసూర్య, సమ్మయ్య, మాలోతు ప్రతాప్‌సింగ్ నాయక్, ఇందిరా, సుజాత, పద్మ, రామకోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల

పాల్వంచరూరల్: గతేడాది గ్రామపంచాయతీలో అప్పు చేసి అభివృద్ధి పనులు చేసినా నేటికీ బిల్లులు ఇవ్వకపోవడంతో వడ్డీ పెరిగిపోతోందని ఆత్మహత్యే శరణ్యమని ఓ సర్పంచ్ మండల సర్వసభ్య సమావేశంలో కన్నీరు పెట్టుకుంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మడివి సరస్వతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ప్రభుత్వశాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. బస్వతారక కాలనీ గ్రామపంచాయతీలో బృహత్తర పల్లె ప్రకృతి వనం ఏర్పాటు కోసం గతేడాది అప్పులు చేసి రూ.6 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని, ఈ బిల్లును ఏఈ ఇంతవరకు ఎంబీ రికార్డు చేయకపోగా తాను ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించడం లేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు ఇచ్చినవారు ఇంటిమీదకు వచ్చి గొడవ చేస్తున్నారని సర్పంచ్ కాశమ్మ కన్నీరు పెట్టుకుంది. స్పందించిన ఎంపీడీఓ ఎంబీ రికార్డు చేసి ఇవ్వాలని మండల ఏఈని ఆదేశించారు. వీధి కుక్కల బారీ నుంచి గ్రామీణ ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు పంచాయతీల్లో నిధులు లేవు. మండలంలోని పలు గ్రామపంచాయతీలో మిడిల్ విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలంటే డబ్బులు చెల్లించాలని ఎన్పీడీసీఎల్ ఏఈ రవీందర్ అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బరపటివాసుదేవరావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎంపీడీఓ జి.రవీంద్రప్రసాద్, ఎంపీఓ నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రనాయక్‌లతోపాటు సర్పంచ్, ఎంపీటీసీలు ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

కంపు కొడుతున్న డ్రెయినేజీలు



కొత్తగూడెం పట్టణ పరిధి విశ్వనాథ్ కాలనీలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డ్రెయినేజీలను నిర్మించలేదు, నిర్మించిన చోట శుభ్రం చేయడం లేదు. ఇళ్లల్లోని మురుగు ఎక్కడిదక్కడే నిల్వ ఉంటోంది. దీంతో తీవ్ర దుర్వాసన, దోమలు, ఈగలు, పందులు అపరిశుభ్రం చేస్తున్నాయి. స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు డ్రెయినేజీలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. – కొత్తగూడెంఅర్బన్

ప్రశ్నించాల్సిన అధికారి : జి.రఘు,
మున్సిపాలిటీ కమిషనర్, కొత్తగూడెం
సెల్ నంబర్ : 9849905882